నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి 1
శుక్రవారం 13 జనవరి 2023

బడి బయట పిల్లల గుర్తింపు

నవతెలంగాణ-నిజాంసాగర్

మండలంలోని మంగుళూరు, ఆరేడు, నర్సింగ్‌రావుపల్లి గ్రామాలలో హాబిటేషన్ పరిధిలో ఉన్న ఇటుక బట్టీలలో బడిబయట పిల్లల సర్వే నిర్వహించారు. మహారాష్ట్రకు చెందిన వలస కూలీల పిల్లలు ఐదుగురిని గుర్తించారు. అదేవిధంగా ఆరేడు గ్రామంలో నలుగురు పిల్లలను గుర్తించినట్టు తెలిపారు. పిల్లల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి ఆయా గ్రామాల బడిలో పిల్లలను చేర్పించారు. కార్యక్రమంలో సీఆర్పీలు శ్రీధర్, వరలక్ష్మి, ఐఈఆర్పీ సునీల్, సాయిలు, ప్రధానోపాధ్యాయులు రాఘవేందర్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎస్ఐ ఆంజనేయులు

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని దేవాయిపల్లి బస్టాండ్ సమీపంలో వడ్ల లారీ నుంచి వడ్ల సంచులు కింద పడిపోయి రోడ్డుకు అడ్డుగా ఉండటంతో అటుఎ వైపుగా క్రిష్ణజివాడికి వెళ్తున్న ఎస్ఐ ఆంజనేయులు చూశారు. రోడ్డుపై ప్రయాణించే వాహనాలకు ఇబ్బంది కలిగి ప్రమాదం జరిగే అవకాశం ఉందని గమనించి ఎస్ఐ స్వయంగా వడ్ల సంచులను రోడ్డు మీద నుంచి పక్కన వేశారు.



సంచులను తొలగిస్తున్న ఎస్ఐ

కంటి వెలుగును పకడ్బందీగా నిర్వహించాలి

- పలువురు అధికారులు
- వైద్య సిబ్బందికి 'కంటివెలుగు'పై శిక్షణ

కంటి వెలుగును పకడ్బందీగా నిర్వహించాలని పలువురు అధికారులు వైద్య సిబ్బందికి, ఆశావర్కర్లకు సూచించారు. ఈ నెల 18 నుంచి ప్రారంభించనున్న 'కంటివెలుగు' కార్యక్రమంపై పలుచోట్ల గురువారం అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు.



బోధన్ : మాట్లాడుతున్న బోధన్ ఆర్డీవో రాజేశ్వర్

నవతెలంగాణ-విలేకరుల బృందం

లింగంపేట్ : ఈనెల 18 నుంచి ప్రారంభించే కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందిగా నిర్వహించాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో శోభరాణి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందికి, ఆశావర్కర్లకు కంటి వెలుగు కార్యక్రమంపై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని అందుకు అందరిని భాగస్వాములు చేయాలన్నారు. 18 సంవత్సరాల పైబడిన వారికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో లింగంపేట మండల వైద్యాధికారి హిమబిందు, కంటి వెలుగు డాక్టర్లు సంగీత, అమల, సీహెచ్‌ఓ రమేష్, యాదగిరి, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆర్డీఓ శ్రీనునాయక్ తెలిపారు. ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలోని అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 18 నుంచి కంటి వెలుగు కార్యక్రమం ఉంటుందని, అందుకు కావాల్సిన ఏర్పాట్లు గ్రామాలలో మండలాలలో మున్సిపల్ కేంద్రాలలో ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని అన్నారు. కంటి వెలుగు కార్యక్రమం 100 రోజులు ఉంటుందని ప్రతి ఒక్కరికి కంటి వైద్యం అవసరం ఉన్నవారికి వైద్యం అందించాలని అన్నారు. కేంద్రాల వద్ద వైద్యులకు, కేంద్రానికి వచ్చే ప్రజలకు సౌకర్యాలు కల్పించాలని ఆయన అన్నారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సంబంధిత శాఖ అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు మల్లికార్జున్‌రెడ్డి, తహసీల్దార్ సుధాకర్, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శోభారాణి, రెవెన్యూ పంచాయతీ హెల్త్ అధికారులు పాల్గొన్నారు.

కంటి వెలుగు కార్యక్రమం పకడ్బందీగా చేపట్టాలి..

బోధన్ : తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటి వెలుగు కార్యక్రమం ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభమవుతున్నందున దానిని మండల, గ్రామ పంచాయతీ అధికారులు పకడ్బందీగా చేపట్టాలని బోధన్ ఆర్డీవో రాజేశ్వర్ ఆదేశించారు. బోధన్ మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 18వ తారీకు నుంచి కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభమవుతున్నందున అన్ని గ్రామ పంచాయతీల్లో ఏర్పాట్లను పరిశీలించాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. ప్రతి సెంటర్లో రోజు 150 మందికి కంటి పరీక్షలు జరిగేలా చూడాలని తెలిపారు. అదేవిధంగా ప్రతి గ్రామపంచాయతీలో హరితహారం, పరిశుభ్రత విషయంలో అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో బోధన్ ఎంపీపీ బుద్దె సావిత్రి రాజేశ్వర్, ఎంపీడీవో మధుకర్, ఏపీవో వినయ్‌కుమార్, అంగన్వాడీ సూపర్‌వైజర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



లింగంపేట్ : మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో

మున్సిపల్ కార్యాలయంలో..

మున్సిపల్ పరిధిలోని ఒకటో వార్డు పాత గ్రామపంచాయతీలో 14వ వార్డు గంజ్ హైస్కూల్లో 18వ వార్డు మాల సంఘం కమ్యూనిటీ హాల్‌లో ఈనెల 18వ తేదీన కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభమవుతుందని కావున దానిని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ తెలిపారు. కౌన్సిలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన వార్డులవారిగా వివరాలు వెల్లడించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ తూము పద్మావతి, అధికారులు పాల్గొన్నారు.

ఎడపల్లి : అధికారులు, ప్రజాప్రతినిధులు, వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు, గ్రామపంచాయతీ కార్యదర్శులు సమిష్టి కృషితో కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎడపల్లి ఎంపీపీ కే శ్రీనివాస్ స్పష్టం చేశారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో కంటి వెలుగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కే శ్రీనివాస్ మాట్లాడారు. ఈనెల 18న ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారికంగా కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్టు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా మొదటగా మండల కేంద్రంలో రెండు కంటి వెలుగు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు వివరించారు. కంటి చూపుతో ఇబ్బందులు పడుతున్న వారికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించిన అనంతరం అవసరమైతే కంటి అద్దాలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీవో గోపాలకృష్ణ అన్నారు. సమావేశంలో ఎడపల్లి సర్పంచ్ ఆకుల మాధవి శ్రీనివాస్, మండల విద్యాశాఖ అధికారి రామారావు, ఎంపీఓ సుభాష్ చంద్రబోస్, ఆయుష్ వైద్యాధికారి వెంకటేష్, ఆసుపత్రి పాలన అధికారి రాములు, పర్యవేక్షకులు నాగేశ్వర్, ఎడపల్లి ఉపసర్పంచ్ ఆకుల శ్రీనివాస్, ఎంపీటీసీ షేక్ జావిద్ బాబా, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ఈ నెల 18వ తేదీన ప్రారంభించనున్నట్టు ఎంపీపీ గాల్‌రెడ్డి తెలిపారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామాలకు సంబంధించిన సర్పంచులు, సెక్రటరీలు పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గుడిసె యాదగిరి, ఆత్మ కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి, రైతుబంధు కన్వీనర్ రామచంద్రం, ఎంపిడిఒ అనంతరావు, ఎంపీఓ ప్రవీణ్ కుమార్, మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ సెక్రటరీలు, సొసైటీ చైర్మన్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



భిక్కనూర్ : మాట్లాడుతున్న ఎంపీపీ

నేడు కంటి వెలుగుపై అవగహనా సదస్సు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు స్థానిక ఎంపీపీ అధ్యక్షతన కంటి వెలుగుపై అవగాహనా సదస్సును నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ మల్లికార్జున్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవగహనా సదస్సులో ఎంపీటీసీలు, సర్పంచులు, ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు అందరూ తప్పకుండా హాజరు కావాలని తెలిపారు.



జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీలో పాల్గొన్న నాయకులు

టీచర్‌పై దాడి అమానుషం

- దుండగులను వెంటనే అరెస్టు చేయాలి
- మల్లికార్జున్‌పై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలి
- స్వేచ్ఛ ఆధ్వర్యంలో ప్రజా సంఘాల నిరసన

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కోటగిరి జెడ్పీ హైస్కూల్ ప్రభుత్వ టీచర్ మల్లిఖార్జున్‌పై దాడి అమానుషమని, దుండగులను వెంటనే అరెస్టు చేయాలని స్వేచ్ఛ జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు కలెక్టర్‌తో పాటు సీపీకి, విద్యాశాఖాధికారులకు విజ్ఞప్తి చేసింది. రాజకీయ పార్టీలు, విద్యార్థి, యువజన, మహిళా సంఘాలు భావప్రకటన స్వేచ్ఛ పరిరక్షణకు నడుం బిగించాయి. ఈ మేరకు స్వేచ్ఛ జేఏసీగా ఏర్పడి గురువారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిరసన చేపట్టాయి. ర్యాలీ, నిరసన ప్రదర్శన, మానవహారం నిర్వహించారు. తర్వాత పోలీస్ కమిషనర్ నాగరాజును కలిసి వినతిపత్రం సమర్పించారు. మల్లికార్జున్‌పైన కేసులు ఎత్తివేయాల్సిందిగా, టీచర్‌పై దాడి చేసిన దుండగులను అరెస్టు చేయాల్సిందిగా కోరారు. అక్కడి నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరి కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చి వెంటనే దీనిపైన చర్య తీసుకోవాల్సిందిగా కోరారు.

వివరాలు మెయిన్‌లో..

మాస్టర్ ప్లాన్ రద్దు కోసం
కౌన్సిలర్లు రాజీనామా చేయాలి



మాట్లాడుతున్న రైతు ఐక్యకార్యాచరణ కమిటీ నాయకులు

- రైతు ఐక్య కార్యచరణ కమిటీ డిమాండ్

నవతెలంగాణ-కామారెడ్డిటౌన్

మాస్టర్ ప్లాన్ రద్దు కోసం మున్సిపాలిటీ విలీన గ్రామంలో ఉన్న తొమ్మిది మంది కౌన్సిలర్‌లు ఈనెల 20వ తేదీలోపు రాజీనామా చేయాలని రైతుల ఐక్య కార్యచరణ కమిటీ డిమాండ్ చేసింది. లేకపోతే కౌన్సిలర్ ఇండ్లు ముట్టడిస్తామని తెలిపారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మాస్టర్ ప్లానకు వ్యతిరేకంగా గత 40 రోజుల నుంచి రైతులు ఉద్యమం చేస్తున్న విషయం తెలిసిందే. బుధవారం నాటికి అభ్యంతరాల గడువు పూర్తి కావడంతో గురువారం మున్సిపాలిటీ పరిధిలోని లింగాపూర్ గ్రామంలో రైతుల ఐక్య కార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో భవిష్యత్తు కార్యచరణపై చర్చించారు.

ఈనెల 15వ తేదీన విలీన గ్రామంలోని రైతులు కుటుంబ సమేతంగా రోడ్డుపైకి వచ్చి ప్రధాన చౌరస్తాలో ముగ్గులు చేయాలని తీర్మానించారు. ఈనెల 20వ తేదీ వరకు వీలిన గ్రామంలోని కౌన్సిలర్లు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాగా 17న పాత రాజంపేట గ్రామంలో రైతు ఐక్య కార్యాచరణ కమిటీ మరోసారి సమావేశం కానుంది.


అసభ్యకరంగా ప్రవర్తించిన టీచర్ సస్పెండ్

నవతెలంగాణ-ఏర్గట్ల

ఏర్గట్ల జడ్పీహెచ్‌లో గణితం ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న పోతు రాజేందర్ విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో విద్యార్థినులు 'రాజేందర్ సర్ మమ్మల్ని ఫిజికల్‌గా టచ్ చేస్తూ.. టార్చర్ చేస్తున్నాడని, ఆ టీచర్ తమకు వద్దని ఎంఈఓ ఆంధ్రయ్యకు లేఖ రాసిన విషయం తెలిసిందే. దీంతో ఎంఈవో ఉపాధ్యాయుల, ప్రజాప్రతినిధుల, విలేకర్ల సమక్షంలో సోమవారం సమావేశం ఏర్పాటు చేసి, విచారణ చేపట్టి నివేదికను డీఈఓ దుర్గాప్రసాద్‌కు సమర్పించారు. అనంతరం డీఈఓ గణిత ఉపాధ్యాయుడు రాజేంధర్ బాధ్యున్ని చేస్తూ.. విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించింది నిజమేనని తెలుసుకొని గురువారం సస్పెండ్ చేస్తున్నట్టు తెలిపారు. ఇదిలా ఉండగా.. సస్పెండ్ అయిన ఉపాధ్యాయుడికి సహకరించిన మరో ఉపాధ్యాయురాలు కుదైజను ఏ చర్యలు తీసుకోకపోవడంతో ఆంతర్యం ఏమిటోనని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. విద్యార్థినులు లేఖలో కీచక ఉపాధ్యాయుడు రాజేందర్‌కు కుదైజ టీచర్ సహకరించిందని స్పష్టంగా రాసినా ఉన్నత విద్యాశాఖాధికారులు ఆమెను విధుల నుంచి ఎందుకు తప్పించలేదని, చర్యలెందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఆమెపై చర్యలు తీసుకోకపోతే ఎంతవరకైనా పోరాడతామని స్పష్టం చేశారు.

ఉదయం పూట వాకింగ్ ఆరోగ్యానికి మేలు

- ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు
- పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 2కే రన్



నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఉదయం పూట వాకింగ్ ఆరోగ్యానికి ఎంతో మేలని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. ఎల్లారెడ్డి పట్టణంలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 2కే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఉదయం 2కే రన్‌ను డి.ఎస్.పి శ్రీనివాసులు, సీఐ శ్రీనివాస్ ప్రారంభించారు. పోలీస్ స్టేషన్ నుంచి ప్రారంభమైన రన్.. సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి శరీర మానసిక అభివృద్ధి కోసం రన్ చేయాలన్నారు. చదువుతోపాటు క్రీడలు ఏంతో అవసరమని తెలిపారు. ప్రతి ఒక్కరు స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ యువజన క్రీడోత్సవాలలో గెలుపొందిన జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం వద్దు

- సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే హనుమంతు షిండే

నవతెలంగాణ-మద్నూర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కోసం అమలు చేసే సంక్షేమ పథకాల నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం చేయకూడదని, గ్రామాల్లో సర్పంచులకు సహకరించాలని జుక్కల్ ఎమ్మెల్యే హనుమంత్‌షిండే అధికారులను ఆదేశించారు. గురువారం మద్నూర్ మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని అధ్యక్షురాలు వాగ్మారే లక్ష్మీబాయి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జుక్కల్ ఎమ్మెల్యే హనుమంతుషిండే సభలో పలు సమస్యలపై సభ్యులు లేవనెత్తిన వాటి పట్ల అధికారుల పనితీరుపై ఎమ్మెల్యే అధికారులను ఆదేశిస్తూ నిర్లక్ష్యం చేయకూడదని సర్పంచులకు సహకరించాలని హెచ్చరించారు. ముఖ్యంగా గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాపై కరెంటు బిల్లుల సమస్యలపై పలువురు సర్పంచులు సభాదృష్టికి తీసుకువచ్చారు. సర్పంచులు లేవనెత్తిన సమస్యలపై ఎమ్మెల్యే స్పందిస్తూ సంబంధిత శాఖల అధికారులను నిర్లక్ష్యం చేయకూడదని ఆదేశించారు. సర్పంచులు కోరే సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. మండల సర్వసభ్య సమావేశానికి పలువురు శాఖల అధికారులు గైర్హాజరు కావడం మంచి పద్ధతి కాదని, మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సర్వేసభ్య సమావేశానికి ప్రతి శాఖ అధికారి హాజరుకావాలని అన్నారు. హాజరు కాని అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని, ఎమ్మెల్యే గైర్హాజరైన అధికారుల పని తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హాజరైన అధికారులు తమ తమ శాఖకు సంబంధించిన నివేదికలు చదివి వినిపించారు. సమావేశంలో ఎంపీపీ వాగ్మరి లక్ష్మీబాయి, వైస్ ఎంపీపీ జైపాల్‌రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షులు సురేష్, ఇన్చార్జి ఎంపీడీవో, మండల పంచాయతీ అధికారి వెంకట నరసయ్య, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పలువురి చిత్రపటాలకు నివాళి..

మద్నూర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో స్వామి వివేకానంద, అలాగే జీజబాయ్ జయంతి వేడుకల సందర్భంగా ఎమ్మెల్యే హనుమంత్ షిండే వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రైల్వేస్టేషన్‌ను పునరుద్ధరించాలని
ఎంపీ అరవింద్‌కు, రైల్వేశాఖ డీఆర్‌ఎంకు స్పీడ్ పోస్టు



నవతెలంగాణ-ఎడపల్లి

మండల కేంద్రంలో రైల్వే స్టేషన్‌ను పునరుద్ధరించాలని కోరుతూ అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా ఎంపీ అరవింద్‌కు, డీఆర్‌ఎం (హైదరాబాద్)కు నాయకులు సంతకాలతో కూడిన వినతిపత్రాలను గురువారం స్పీడ్ పోస్ట్ చేశారు. ఎడపల్లి మండల కేంద్రంలో రైల్వేస్టేషన్ తప్పనిసరి అవసరమని నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా ఎంపీ అరవింద్, రైల్వే శాఖ డీఆర్‌ఎం సానుకూలంగా స్పందించి ఎడపల్లిలో రైల్వే స్టేషన్ పునరుద్ధరించాలని నాయకులు డిమాండ్ చేశారు. లేని పక్షంలో రోజువారీగా నిరసన కార్యక్రమాలు చేపడతామని నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం బోధన్ డివిజన్ కార్యదర్శి ఎస్కే నశీర్, తదితరులున్నారు.

ఆశావర్కర్లకు గౌరవ వేతనం పెంచాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమం దాదాపు వంద రోజుల పాటు కొనసాగే అవకాశం ఉన్నందున, ఈ వంద రోజులు కంటి వెలుగు పనిలో ఆశావర్కర్లు ఉండాలని ప్రభుత్వం ఆదేశించిన దృష్ట్యా, ప్రభుత్వం ఇప్పటి వరకు అదనపు పారితోషికం నిర్ణయం చేయలేదని తెలిపారు. ఆశావర్కర్లకు వెంటనే గౌరవ వేతనం పెంచాలని ఆశావర్కర్‌ల సంఘం ప్రతినిధులు తెలిపారు. గురువారం ఎల్లారెడ్డి మండలంలోని మత్తమాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ శోభారాణికి మండల ఆశావర్కర్‌లు సంఘం ప్రతినిధులు మంజుల, హసీనా, స్వరూప, సంధ్య వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఒకటి కాదు రెండు కాదు సుమారు వంద రోజుల పనికి అదనపు పారితోషికం నిర్ణయం చేయకపోవడం సమంజసం కాదన్నారు. పనిని బట్టి పారితోషికాలు చెల్లిస్తున్నప్పుడు ప్రతి అదనపు పనికి పారితోషికాలు కూడా ప్రభుత్వం న్యాయంగా చెల్లించాలని అన్నారు. ఫిక్స్‌డ్ వేతనం లేక, అదనపు పారితోషికాలు ప్రభుత్వం చెల్లించకపోవడంతో ఆశాలు రాష్ట్రవ్యాప్తంగా అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అదనపు వేతనం ఇవ్వాలని కోరారు.

హెచ్‌ఎం, ఎంఈవోలను సస్పెండ్ చేయండి

- వామపక్ష విద్యార్థి సంఘాల డిమాండ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



డీఈవోకు వినతినిస్తున్న నాయకులు

ప్రభుత్వ ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌పై దాడిలో ప్రత్యక్షంగా పాల్గొన్న హెచ్‌ఎం, ఎంఈఓలను సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కోటగిరి మండలంలోని హైస్కూల్‌లో పనిచేస్తున్న తెలుగు టీచర్ మల్లికార్జున్‌పై బీజేపీ, విశ్వహిందూ పరిషత్ నాయకులు ఉద్దేశపూర్వకంగా దాడిలో ప్రత్యక్షంగా పాల్గొన్న హెచ్‌ఎం, ఎంఈఓలను సస్పెండ్ చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు రఘురాం, నరేందర్, నాగరాజ్, రాజేశ్వర్ మాట్లాడుతూ.. వినాయక చవితికి చందా అడిగితే ఇవ్వని టీచర్ మల్లికార్జున్‌ను బీజేపీ విశ్వహిందూ పరిషత్ నాయకులు ఉద్దేశపూర్వకంగా అన్యమత ప్రచారం చేస్తున్నాడని, దేవుళ్లను కించపరుస్తున్నాడనే నెపంతో తనను అమానవీయంగా అవమానకరంగా హింసించారని అన్నారు. చట్టాన్ని తన చేతుల్లోకి తీసుకొని ఒక ప్రభుత్వ టీచర్‌ను బలవంతంగా స్కూల్‌కి తీసుకెళ్లి క్షమాపణ చెప్పించుకోవడం, మానసికంగా హింసించడం సహించరానిదని అన్నారు. సభ్య సమాజం తలదించుకునే విధంగా అమానవీయంగా బీజేపీ విశ్వహిందూ పరిషత్ నాయకులు వ్యవహరించాలని, దీనికి పూర్తి బాధ్యత భారతీయ జనతా పార్టీ వహించాలని అన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం కోసం ప్రతి ఉపాధ్యాయుడికి హక్కు ఉందని అది భారత రాజ్యాంగం కల్పించిందని అన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 భావ ప్రకటన స్వేచ్ఛను భారతదేశంలోని ప్రతి పౌరుడికి ఇచ్చిందని దీనిని కాలరాసే విధంగా బీజేపీ విశ్వహిందూ పరిషత్ మూకలు వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటు అన్నారు. ఘటనలో ప్రత్యక్షంగా పాల్గొన్న హెచ్‌ఎం, ఎంఈఓలను వెంటనే సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జిల్లా వ్యాప్తంగా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ సుబోధ్, పీడీఎస్‌యూ చరణ్, ఎస్ఎఫ్ఐ మహేష్, జవహర్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జిని కలిసిన నాయకులు

నవతెలంగాణ-రామారెడ్డి

తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జిగా నూతనంగా నియమించిన మాణిక్‌రావు ఠాక్రేను జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి, మాచారెడ్డి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గణేష్ నాయక్, సోమార్పేట్ సర్పంచ్ హాసీలాల్ గురువారం శాలువాతో సన్మానించి, పుష్పగుచ్చాలు అందజేశారు.

వందరోజులపాటు కంటి వెలుగు

నవతెలంగాణ-ఆర్మూర్

ఈనెల 18 నుండి ప్రారంభమయ్యే రెండోవిడత కంటి వెలుగు కార్యక్రమానికి సంబంధించి వివిధ శాఖల సమన్వయ సమావేశం మున్సిపల్ ఆఫీసులో గురువారం నిర్వహించారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో ఈ కార్యక్రమం సుమారు 100 రోజులపాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. 18ఏండ్లు పైబడిన వారు ఈ క్యాంపులో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైనచో కంటి అద్దాలు పంపిణీచేసి ఆర్డర్ చేస్తారన్నారు. ఉచితంగా మందులు కూడా పంపిణీ చేస్తారని, పట్టణ ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. కంటి వెలుగు ఆహ్వాన పత్రికలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత పవన్ కౌన్సిలర్లు ఆకుల రాము చాలా ప్రసాద్ ,మున్సిపల్ కమిషనర్, మెడికల్ ఆఫీసర్లు ,ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలన

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేష్ బిగాల, మున్సిపల్ కమిషనర్ చిత్రమిశ్రా, ఆర్అండ్‌బి, పబ్లిక్‌హెల్త్, మున్సిపల్ అధికారులతో కలిసి నగరంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను గురువారం పరిశీలించారు. ఖలీల్‌వాడిలో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ ను పరిశీలించారు. బడా రామమందిరం వద్ద చారిత్మక కోనేరును పరిశీలించి పరిరక్షించాలని అధికారులను ఆదేశించారు. అహ్మది బజార్ లో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్‌ను పరిశీలించారు. వర్ని రోడ్డు, ఖిల్లా, అర్సపల్లి, దుబ్బలో నిర్మిస్తున్న వైకుంఠ దామాలను పరిశీలించారు. నిజాం సాగర్ కెనాల్‌పై బాబాన్ సాబ్ పహడి వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జిని పరిశీలించారు. నాణ్యత ప్రామాణికంగా నిర్దిష్ట వ్యవధిలో పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్,నుడ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

వివేకానందుడిని యువత ఆదర్శంగా తీసుకోవాలి

నవతెలంగాణ-విలేకరుల బృందం

భారత దేశ విశిష్టతను ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి వివేకానందుడని, యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని భీంగల్ సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. వివేకానందుడి 160వ జయంతిని పురస్కరించుకొని గురువారం ఆయన విగ్రహాలు, ఫొటోలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. గురువారం పలు గ్రామాల్లో యువజన సంఘాలు, పాఠశాలల్లో వివేకానందుని జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

కమ్మర్‌పల్లి :మండలంలోని చౌట్‌పల్లిలో వివేకానంద విగ్రహానికి భీంగల్ సీఐ వెంకటేశ్వర్లు పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతఆత్మ విశ్వాసంతో ముందడుగు వేయడానికి వివేకానందుడి జీవిత చరిత్రను అదర్శంగా తీసుకోవలన్నారు.యువత వివేకానందుడి బోధనలను అచరించాలన్నారు. స్వామి వివేకానందుడు భారత దేశ సంస్కృతి, సాంప్రదాయాల ఔన్నత్యాన్ని ప్రపంచ దేశాలకు చాటిన మహనీయుడని కొనియాడారు.కమ్మర్‌పల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఇవో ఆంధ్రయ్య మాట్లాడుతూ వివేకనందుని బోధనలు ఆచరణలో పెట్టి యువత, విద్యార్థులు తమ లక్ష్యాలను నేరవేర్చుకునేలా కృషి చేయాలన్నారు. వివేకనందుని ఆశయాలకు అనుగుణంగా దేశాభివృద్ధికి కృషి చేస్తూ, పట్టుదలతో చదివి విలువలు కలిగిన విద్యనభ్యసించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలన్నారు.

కంఠేశ్వర్:నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త గాజుల్ పెట్ లోని వివేకానందుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్ ,నుడ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

నవీపేట్:మండలంలో బీఆర్ఎస్, బీజేపీ, కోస్లి, నాళేశ్వర్ గ్రామాలలో సర్పంచుల ఆధ్వర్యంలో స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత స్వామి వివేకానంద ఆదర్శాలను పునికిపుచ్చుకొని ముందుకు సాగాలని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తెడ్డు పోశెట్టి, సాయికుమార్ గౌడ్, లోకం నర్సయ్య, సూరిబాబు, బిజెపి నాయకులు బందెల ఆనంద్, రామకృష్ణ, ఎంపీటీసీ రాధా, పుట్ట శ్రీనివాస్ గౌడ్, గణేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థినిలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. మండల కేంద్రంలోని బాలుర పాఠశాలలో పోటీలు నిర్వహించారు. అంతకుముందు స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు తెడ్డు నవనీత్, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి:ఇందల్‌వాయి మండలకేంద్రంలోని తిర్మన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల చైర్మెన్ సాయిలు ఉత్సాహంతో పాల్గొని బాలికలు ముగ్గులు, బాలురు గాలి పటాలను ఎగురవేసిశారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రావు మాట్లాడుతూ వివేకానందుని స్ఫూర్తిగా తీసుకొని లక్ష్యంతో ధైర్యంగా యువత ముందుకు నడువాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ఇందల్ వాయి మండలంలోని జాతీయ రహదారి 44 గన్నారం గ్రామ స్వాగత తోరణం వద్ద వివేకనంద జయంతి, యూత్ డే ను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి బాదవత్ రమేష్ నాయక్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు చిలివెరి గంగా దాస్, సర్పంచ్లు తెలు విజయ్ కుమార్,జి నరేష్, అరటి రఘు, పిండి గంగాధర్, విగ్నేశ్వేర్, టి గణేష్, రాజేష్, కుమార్, జీవన్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

నందిపేట్:వివేకానంద సమితి ఆధ్వర్యంలో గురువారం నందిపేట మండల కేంద్రం వివేకానంద చౌరస్తాలోగల వివేకానంద విగ్రహానికి పార్టీలకతీతంగా యువకులంతా కలిసి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మచ్చర్ల సాగర్ మాట్లాడుతూ... స్వామి వివేకానంద భారత దేశ యువతకే కాదు ప్రపంచానికే ఆదర్శప్రాయుడని అన్నారు. నేటి యువత కులమతాలకు అతీతంగా ఆయన చూపిన మార్గంలో నడుస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో వివేకానంద సేవా సమితి సభ్యులు, గీత కాన్వెంట్ విద్యార్థులు,మండల యువకులు తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ:మండలంలోని పెద్దవాల్గోట్ గ్రామంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఇందూరు జిల్లా కార్యవర్గ సభ్యులు రాచర్ల గంగాధర్ మాట్లాడుతూ.. భారత దేశం కీర్తి ప్రతిష్టలు ప్రపంచానికి చాటిన మహనీయులు, భారతదేశం గొప్పతనాన్ని చికాగో సమావేశంలో ప్రపంచానికి తెలియజేసిన వ్యక్తి జయంతి ఉత్సవాన్ని జాతీయ యువజన ఉత్సవంగా జరుపుకుంటామని తెలిపారు. పిల్లల్లో దేశభక్తి, జాతీయభావం పెంపొందించడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వాల్గోట్ కలన్ ప్రధానోపాధ్యాయులు రాజయ్య, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్రామ్, తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర మహిళ కన్వీనర్ నీలవేణి, తపస్ సిరికొండ మండల శాఖ అధ్యక్షులు దుబ్బాక నర్సింగ్ రావు, మండల ప్రధాన కార్యదర్శి శ్రీధర్, గౌరవ అధ్యక్షులు మోతిలాల్, సలహాదారులు శ్రీకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఏర్గట్లలో...

ఏర్గట్ల:స్వామి వివేకానంద జయంతి ని పురస్కరించుకుని గుమ్మిర్యాల్ గ్రామంలో జాతీయ యువజనోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ శీ సోమ రాజారెడ్డి, ఎంపీటీసీ బొల్లి శంకర్, బీజేపీ మండలాధ్యక్షులు నారాయణ రెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామ యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాక్లూర్ :మండల కేంద్రంలో సర్పంచ్ బి. అశోక్ కుమార్ వివేకానందుని విగ్రహానికి పూలమాల వేసి పూలమాల వేశారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో వివేకానందుని జయంతిని నిర్వహించారు. మండల కేంద్రంలోని వివేకానందుని విగ్రహానికి బిజెపి పార్టీ ఆధ్వర్యంలో వివేకానందుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. భారతీయ జనతా పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ నాయకులు సంతోష్, గంగోని వినోద్ కుమార్, సురేష్ నాయక్, జానకిరామ్, కలగడ్డ బాలాజీ, మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మోపాల్:మండలంలోని మంచిప్ప గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎస్సై మహేష్ కుమార్ హాజరై వివేకానంద విగ్రహానికి పూలమాలవేసి కేక్ కట్ చేశారు. సర్పంచ్ సిద్ధార్థ ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో స్వామి వివేకానంద ఫర్ యూత్ అనే పుస్తకాన్ని విద్యార్థులందరికీ పంపిణీ చేశారు. వివేకానంద జీవిత చరిత్ర గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జగదీష్, సాయి రెడ్డి, మైసయ్య యుగంధర్, శ్రీనివాస్, కో ఆప్షన్ అజీమ్, వి డి సి ప్రెసిడెంట్ నవీన్ గంగారెడ్డి, మధు శంకర్, గ్రామ యువత, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నిజామాబాద్ సిటీ :స్వామి వివేకానంద ఆశయ సాధనకు ప్రయత్నం చేద్దామని పార్లమెంట్ అధ్యక్షులు దేగాం యదగౌడ్ అన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగు యువత అధ్యక్షులు శ్రీనివాస్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా దేగాం యదగౌడ్ మాట్లాడుతూ దేశానికి వెన్నుముక యువతఅని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని అన్నారు. యువత రాజీయాల్లోకి రావాలని, రాష్ట్రంలో ఏర్పడిన పరిస్థితుల దృష్ట్యా ప్రశ్నించడం నేర్చుకోవాలని తెలిపారు. ఖచ్చితమైన లక్ష్యాలు పెట్టుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర టీఎన్‌టీయూసీ నాయకులు కోయేడి నర్సింలు, మండల అధ్యక్షులు జావేద్, పోతని సత్యం, అర్బన్ సీనియర్ నాయకులు లవంగ రాజు, మావూరి రాజా శేఖర్, నరసింహ, ఫిరోజ్, రవి, వంశీ, రోహన్, హర్ష అషిత్, లక్ష్మణ్, సాగర్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లిలో..



ఆర్మూర్: అంకాపూర్ భార్గవి విద్యానికేతన్‌లో..

ఆర్మూర్:పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆఫ్ నవనాథపురం ఆధ్వర్యంలో జెంటిల్ కిడ్స్ ప్రజ్ఞ ఐఐటి పాఠశాల, బిజెపి పట్టణ నాయకులు జెస్సు అనిల్, మండలంలోని అంకాపూర్ భార్గవి విద్యానికేతన్, వేల్పూర్ మండలంలోని పడిగేల ఉన్నత పాఠశాలలో గురువారం స్వామి వివేకానందుని జయంతి నిర్వహించారు. బాల్కొండ కృష్ణవేణి పాఠశాలలో ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ అధ్యక్షులు చిన్న రవికుమార్, మోహన్ దాస్, అంబల్ల తిరుపతి, మహిళ ప్రాంగణం అకౌంటెంట్ రాజాశ్రీ, పద్మ, శ్వేత, జెంటిల్ కిడ్స్ గుజరాతి ప్రకాష్, రోమా వంశీ, భార్గవి విద్యానికేతన్ ప్రిన్సిపాల్ ప్రగతి పట్వారి, కరస్పాండెంట్ వెంకటేష్ గౌడ్, విద్య గోపి, పీఆర్‌టీయూ నాయకులు పెంట జలంధర్, మంచిర్యాల సురేష్ కుమార్ పాల్గొన్నారు.



మాక్లూర్‌లో..



మోపాల్: మంచిప్పలోని పాఠశాలలో..



డిచ్‌పల్లిలో..



నందిపేట్‌లో..



నవీపేట్‌లో..



నిజామాబాద్‌సిటీ : టీడీపీ ఆధ్వర్యంలో..

యూజీ పరీక్షలో ముగ్గురు డిబార్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో గురువారం ఉదయం జరిగిన యూజీ 4వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్ష లో 2844 విద్యార్థులకు గాను 2719 మంది హాజరయ్యారని, 125మంది గైర్ హాజరు అయ్యారని

తెలంగాణ యూనివర్సిటీ పరిక్షల నియంత్రణ అధికారిణి ప్రొఫెసర్ డాక్టర్ ఎం అరుణా ఒక ప్రకటనలో తెలిపారు. గౌతమి డిగ్రీ కళాశాల నిజామాబాద్‌లో ఒకరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల బోధన్ పరీక్ష కేంద్రంలో ఒకరు డిబార్ అయ్యారని పేర్కొన్నారు. మధ్యాహ్నం జరిగిన 3వ సెమిస్టర్ (రెగ్యులర్)పరీక్షలో 8 553 కి గాను 7851మంది హాజరయ్యారని, 702 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని, నిశిత డిగ్రీ కళాశాల బోధన్ లో ఒక విద్యార్థి డిబార్ అయ్యారని తెలిపారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు

నవతెలంగాణ-ఆర్మూర్

పీడీఎస్‌యూ, పీఓడబ్ల్యు, పీవైఎల్, అరుణోదయ , ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో విద్యార్థులకు క్రీడా పోటీలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు మ్యూజికల్ చైర్, జనరల్ నాలెడ్జ్, క్విజ్, స్కిప్పింగ్, తదితర ఆటలు నిర్వహించారు.గెలిచిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పిఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షులు గోదావరి, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నరేందర్ మాట్లాడుతూ...విద్యార్థులు చదువులో రాణించి హక్కుల కోసం పోరాడాలని వారన్నారు. కార్యక్రమంలో ఏరియా పీడీఎస్‌యూ అధ్యక్షులు అనిల్ కుమార్, కార్యదర్శి నిఖిల్, ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు సత్తెక్క, పద్మక్క, పుష్ప, సునీత, పీడీఎస్‌యూ నాయకులు నవీన్, వినోద్, రాము పాల్గొన్నారు.

కామ్రేడ్ శావుల సాయన్న స్ఫూర్తితో రైతు ఉద్యమాన్ని నిర్మిస్తాం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

రైతాంగ ఉద్యమ నాయకుడు కామ్రేడ్ శావులం సాయన్న స్ఫూర్తితో జిల్లాలో బలమైన రైతంగా ఉద్యమాని నిర్మిస్తామని అఖిల భారత రైతు కూలి సంఘం ఏఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య అన్నారు. నగరంలోని ద్వారాక నగర్ ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో అఖిల భారత రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో శావుల సాయన్న 27 వ వర్ధంతి సందర్భంగా అయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయక్ వాడి నర్సయ్య, మురళి, పద్మ భారతి, సాయిలు, ఎల్లయ్య, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు విజయ్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న అమృతలత

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని విజయ్ పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికయ్యారు. 50వ రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన (ఆర్‌బీవీపీ) డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, తెలంగాణ ఆధ్వర్యంలో సెయింట్ థామస్ హైస్కూల్ నిర్మల్లో ఈ నెల 9 నుండి 11 వరకు నిర్వహించారు. టెక్నాలజీ అండ్ టాయ్స్ విభాగంలో వ్యర్థాల నుండి సంపద (వెల్త్ ఫ్రం వేస్ట్) అనే అంశంపై గైడ్ టీచర్ మధు ఆధ్వర్యంలో తొమ్మిదవ తరగతి చదివే కే. వంశీకృష్ణ, పి.వాఙ్మయి పాల్గొని ప్రథమ స్థానాన్ని పొంది జాతీయ స్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యారు. పర్యావరణానికి హాని కలిగించే వ్యర్థప్లాస్టిక్ వస్తువుల నుండి ఇంధనాన్ని తయారు చేసే విధానాన్ని ఈ ప్రదర్శనలో తమ ప్రయోగం ద్వారా చూపించారు.సైంటిఫిక్ ఇన్నోవేషన్ ఫర్ సస్టైనబుల్ ఫ్యూచర్ (సెమినార్) అనే అంశంపై గైడ్ టీచర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో 8వ తరగతి చదివే రౌదాజహాన్ పాల్గొని ప్రశంసా పత్రాన్ని అందుకుంది. జిల్లాస్థాయిలో 10వ తరగతి విద్యార్థులకు తెలంగాణ సోషల్ స్టడీస్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పోటీలో కే. సహర్షి రెడ్డి పాల్గొని మొదటి బహుమతిని సాధించి ఈ నెల 19న జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని కరస్పాండెంట్ ప్రభాదేవి తెలిపారు. జాతీయస్థాయికి రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను, గైడ్ టీచర్‌ను కార్యదర్శి అమృతలత, కరస్పాండెంట్ ప్రభాదేవి, అకడమిక్ డైరెక్టర్ టి. వసంత, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ పి.సుజాత, ప్రిన్సిపాల్ పి. విజేత అభినందించారు.

బీఆర్ఎస్ రూరల్ మండల క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరించిన బాజిరెడ్డి జగన్, నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

రాష్ట్ర ఆర్టీసీ కార్పొరేషన్ చైర్మన్, నిజామాబాద్ గ్రామీణ శాసనసభ్యులు బాజిరెడ్డి గోవర్ధన్ నివాసంలో జిల్లా యువ నాయకులు, జిల్లా ఒలంపిక్ ఉపాధ్యక్షులు, జడ్పీటిసి బాజిరెడ్డి జగన్మోహన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. నిజామాబాద్ రూరల్ మండల బీఆర్ఎస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా తయారుచేయించిన 2023 నూతన క్యాలెండర్ ఆవిష్కరించారు.

ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష

నవతెలంగాణ-ధర్పల్లి

డంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఒకరికి రెండు రోజులు జైలు శిక్ష విధిస్తూ నిజామాబాద్ రెండవ అదనపు కోర్టు న్యాయమూర్తి ఖదీర్ తీర్పునిచినట్లు ఎస్ఐ వంశీ కృష్ణ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 6న ధర్పల్లి పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తుండగ సిరికొండ మండలంలోని తూంపల్లి పంచాయతీ పరిధిలోని గంగా నాయక్ తండా కు చెందిన భూక్యా మోజ్యా పట్టుబడగా కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచారు. ఆయన్ను రెండో అదనపు కోర్టులో న్యాయమూర్తి రెండు రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువడి నట్లు తెలిపారు.

ఉత్తమ సేవా కార్యక్రమాలకు సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

భీంగల్ పట్టణానికి చెందిన అంకం జ్యోతి చేస్తున్న సామాజిక సేవ కార్యమాలను గుర్తించి ఆమె భర్తను మండలంలోని చేపూర్ క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం సన్మానించారు. అనివార్య కారణాలవల్ల ఆమె స్థానంలో భర్త సంతోష్ కుమార్‌కు సన్మానించారు. తన భర్త సహాయంతో ఎంతో మంది ఆకలితో అలమటిస్తున్న వారికి 13 సంవత్సరాలుగా కడుపు నింపుతూ ముందుకు సాగిపోతుందన్నారు. ఈ సందర్భంగా సీఐ సురేష్‌బాబు, రేలారే రేలా గంగ, గోవింద్‌పేట్ సొసైటీ చైర్మన్ బంటు మహిపాల్ చేతుల మీదుగా అవార్డు మెమోంటోను అందజేశారు.

జాతీయస్థాయిలో సాహిత్య బహుమతులు అందుకున్న తడపాకల్ విద్యార్థులు



జాతీయస్థాయి సాహిత్య బహుమతులు అందుకున్న విద్యార్థులు

నవతెలంగాణ-ఏర్గట్ల

ఆజాదిక అమృత మహోత్సవంలో భాగంగా ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో గత సెప్టెంబర్ నెలలో నిర్వహించిన జాతీయస్థాయి పాఠశాల విద్యార్థుల కథా, కవిత పోటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తడపాకల్ విద్యార్థులు రెండు బహుమతులు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా తెలుగు పండితులు ప్రవీణ్ శర్మ మాట్లాడుతూ... తమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న లతిక రాసిన "వీర సైనికులు" అనే కథకు జాతీయస్థాయిలో రెండో బహుమతి వచ్చిందని తెలిపారు. ఇదే పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న సంయుక్త రాసిన "మాతృభూమి" అనే కవితకు ప్రోత్సాహక బహుమతి అందుకుందని చెప్పారు. జాతీయస్థాయిలో ద్వితీయ బహుమతి పొందిన లతికకు మూడు వేల రూపాయల నగదు బహుమతిని, ప్రశంసా పత్రం, అదేవిధంగా ప్రోత్సాహక బహుమతి అందుకున్న సంయుక్తకు వెయ్యి రూపాయల నగదు బహుమతి, ప్రశంసా పత్రం ప్రధానోపాధ్యాయులు రాములు, తెలుగు పండితులు ప్రవీణ్ శర్మ అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్, నరేంధర్, కృష్ణ ప్రసాద్, గంగాధర్, స్వప్న, సుజాత విజయలక్ష్మి,విజయ పాల్గొన్నారు

ఆర్యభట్ట మెంటల్ ఎబిలిటీ మహోత్సవంలో సత్తాచాటిన నలంద విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లిలోగల నలంద ఒలంపియాడ్ హైస్కూల్ ఐఐటి ఫౌండేషన్ విద్యార్థులు ఈ- అభ్యాస హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో డిసెంబర్ 7న రాష్ట్రస్థాయిలో నిర్వహించిన (అర్యబట్ట - మెంటల్ ఎబిలిటీ మహోత్సవ) పరీక్షలో నలంద విద్యార్థులు మొదటి 30 ర్యాంకుల్లో నిలిచి సత్తా చాటినట్టు పాఠశాల యాజమాన్యం లక్కారం, రాజేంద్రప్రసాద్, సాగర్ గురువారం తెలిపారు. ఈ - అభ్యాస అకాడమీ ఆధ్వర్యంలో డిసెంబర్ 7న రాష్ట్ర స్థాయిలో 600 ప్రైవేటు స్కూల్స్ నుంచి 2400 విద్యార్థులు పాల్గొన్న ఈ పరీక్షల్లో నలంద విద్యార్థులు ప్రతిభ చాటారు. అప్పల సాయితేజ రాష్ట్రస్థాయి రెండోర్యాంకు సాధించింది. 20 లోపు ర్యాంకు సాధించిన విద్యార్థులు బొమ్మకంటి సంకీర్తన 12 వ ర్యాంకు, సమల హరిణి, టీ.తేజస్విని 15వ ర్యాంకు, యం.బాలాజీ 16వర్యాంకు, యన్.వర్షిత్ గౌడ్, ఎన్. స్ఫూర్తి 17వ ర్యాంకు, రిశ్విక, గగన్ (18), నిలేష్, శ్రీ లక్ష్మి 20వ ర్యాంకు, స్నేహలత, తనిశ్రి 21వ ర్యాంకు, జాహ్నవి22వ ర్యాంకు, వెంకట నారాయణ 23వర్యాంకు, హరిని 24వ ర్యాంకు, అబియనాజ్, అశ్వితా 24వర్యాంకు సాధించారని తెలిపారు.



ప్రతిభ కనబర్చిన నలంద విద్యార్థులు

ఒలంపియాడ్ స్కూల్ రెండునుండి ఐదో తరగతి విద్యార్థులు కే.అభినయ్, వెంకటలక్ష్మి, పి నితీష స్టేట్ రెండో ర్యాంకులు సాధించారన్నారు. రాష్ట్రస్థాయి ర్యాంకులు తెచ్చుకోవడం నలంద స్కూల్‌కి చాలా గర్వకారణమని అన్నారు. ర్యాంకులు రావడానికి కృషి చేసిన సబ్జెక్ట్ టీచర్స్ హన్మండ్లు , స్రవంతి, ఒలంపియాడ్ స్కూల్ ఉపాధ్యాయుడు శివను నలంద యాజమాన్యం శాలువాలతో సన్మానించారు.

టీచర్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి

బీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్

నవతెలంగాణ-కంఠేశ్వర్

కోటగిరి టీచర్ మల్లికార్జున్‌పై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని బీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దండివెంకట్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో అధికారం కోసం బీజేపీ నాయకులు ప్రజల మధ్య చిచ్చురేపి అధికారంలోకి రావడానికి అన్నిరకాల మతోన్మాద చర్యలకు పాల్పడుతుందన డానికి కోటగిరి టీచర్ మల్లిఖార్జున్ ఘటనే ఉదాహరణని అన్నారు. ఈ మేరకు గురువారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్‌లో భావప్రకటన స్వేచ్ఛ జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. టీచర్ మల్లిఖార్జున్‌పై దాడి చేసి అవమానించిన అందరిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రజల మధ్య చిచ్చురేపే శక్తులపట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.సిద్ధిరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్, బహుజన మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దండు జ్యోతి, నాయకులు స్వప్న, బీఎస్పీ సీనియర్ నాయకులు న్యాయవాది రెడ్డు రాము, దళిత సీనియర్ నాయకులు బంగారు సాయిలు, భారత్ ముక్తి పార్టీ నాయకులు రాము, రాంచందర్, బీఎల్‌టీయూ నాయకులు అబ్దుల్ల, విశ్వనాథ్, సయ్యద్, కృష్ణ, హరీష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ చైర్మన్‌కు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

టీఎస్ఆర్‌టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ శాసనసభ్యులు బాజిరెడ్డి గోవర్ధన్ ఇంటి వద్ద మండల నాయకులు ఆయన్ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బానోత్ అనుష ప్రేమ్ నాయక్ జెడ్పిటిసి సుమలత గోపాల్ రెడ్డి, వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మీసాల మధుకర్ రావు,గుండారం సొసైటీ చైర్మన్ దాసరి శ్రీధర్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు బానోత్ గోపాల్ నాయక్ , మండల మైనారిటీ సెల్ అధ్యక్షులు జమీర్ ఖాన్, పార్టీ సీనియర్ నాయకులు గంగారం నాయక్ , వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు, సర్పంచ్‌లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధికి
పక్కా ముసాయిదా తయారు చేయాలి

నవతెలంగాణ-పిట్లం

గ్రామ పంచాయతీల అభివృద్ధికి పక్క ముసాయిదా తయారు చేయాలని ఎల్లారెడ్డి డివిజనల్ పంచాయతీ అధికారి, ట్రెయినర్ సురేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై పిట్లం, పెద్దకొడప్‌గల్, నిజాంసాగర్ మండలాల పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2023-24 సంవత్సరానికి గానూ గ్రామ పంచాయతీల డెవలప్‌మెంట్ ప్లాన్ జీపీ డీపీ అభివృద్ధి పక్కా ప్రణాళికల ముసాయిదాలను తయారుచేసి సంబంధిత అధికారులకు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ డివిజనల్ పంచాయతీ అధికారి శ్రీనివాస్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, మూడు మండలాల ఎంపీఓలు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని జంగంపల్లి గ్రామానికి చెందిన 15 మంది లబ్దిదారులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గ్రామ ప్రజాప్రతినిధులు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నర్సింలు యాదవ్ మాట్లాడుతూ కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన ప్రభుత్వ విప్ గంప గోవర్దన్‌కు లబ్దిదారుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్, జంగంపల్లి సొసైటీ చైర్మన్ సిద్దరాములు, ఉపసర్పంచ్ భాస్కర్ చారి, గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బాలచంద్రం, టీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అత్తిలి శ్రీనివాస్, పుల్లూరి శివలింగం, టీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు సభ్యులు, లబ్దిదారులు, తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాలను పరిశీలించిన జిల్లా వ్యవసాయాధికారి

నవతెలంగాణ-కోటగిరి

మండల పరిధిలోని అమరాపూర్ శివారులో ఫామాయిల్ తోటలను జిల్లా వ్యవసాయాధికారి ఆర్.తిరుమల ప్రసాద్ గురువారం పరిశీలించారు. ఎత్తొండ గ్రామానికి చెందిన భాస్కర్ అనే రైతు ఫామ్ ఆయిల్ తోటలో పెంపకం గురించి అడిగి తెలుసుకున్నారు. రైతులు వివిధ పంటలకు యూరియా తక్కువగా వాడాలని, యూరియాను నిల్వలు చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో మండల రైతు కన్వీనర్ కొల్లూరు కిషోర్ బాబు, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు గౌస్, సందీప్ పాల్గొన్నారు.

వివేకానంద విగ్రహ ఏర్పాటుకు సహకరించాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

స్వామి వివేకానంద విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని బీజేపీ నాయకులు స్థానిక మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్‌కు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా పక్కన ఉన్న డివైడర్‌పైన స్వామి వివేకానంద విగ్రహం ఏర్పాటు చేసుకోవడానికి అనుమతి ఇవ్వాలని, ఈ విగ్రహం ఏర్పాటులో ఇబ్బందులు ఉండవని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు సతీష్, ఎల్లారెడ్డి పీఏసీఎస్ వైస్‌చైర్మన్ ప్రశాంత్ గౌడ్, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి కుర్మ సాయిబాబా, ప్రశాంత్, మర్రి బాలయ్య, కిషన్, శంకర్, పృథ్విరాజ్ తదితరులు పాల్గొన్నారు.

గోవూర్‌లో రక్తదాన శిబిరం

నవతెలంగాణ-వర్ని

స్వామి వివేకానంద జయంతి సందర్భంగా మోస్రా మండలంలోని గోవూర్ గ్రామంలో రక్తదానం శిబిరాన్ని గురువారం ఏర్పాటు చేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదానం శిబిరాన్ని ఏర్పాటు చేయడంతో సర్పంచ్ నరేందర్ రెడ్డి, యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ మోస్రా మండల చైర్మన్ కె.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. వివేకానంద స్వామిని ఆదర్శంగా తీసుకుని గ్రామంలోని 40 మంది యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం అభినందనీయమని అన్నారు. రక్తదానం చేస్తే మరొకరి ప్రాణాన్ని కాపాడిన వారం అవుతామని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా మెంబర్ నాగార్జునరెడ్డి, జిల్లా ప్రెసిడెంట్ బుస్సా ఆంజనేయులు, రాష్ట్ర సెక్రెటరీ రాజశేఖర్, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

చెక్‌డ్యామ్ నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని గొల్లపల్లిలో చెక్ డ్యాం నిర్మాణానికి గ్రామ సర్పంచ్ పాల లావణ్య మల్లేష్, రిలయన్స్ ఫౌండేషన్ వారితో కలిసి గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రిలయన్స్ ఫౌండేషన్ వారు మా గ్రామాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేయటం పట్ల గ్రామం తరపున కృతజ్ఞతలు తెలిపారు. గొల్లపల్లి శకరి రేవు వాగు వద్ద రిలయన్స్ ఫౌండేషన్ నిధుల నుంచి రూ.4లక్షల 50వేలతో పనులు ప్రారంభించినట్టు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నరసయ్య, టీఆర్ఎస్ సీనియర్ నాయకులు పాల మల్లేష్, రిలయన్స్ ఫౌండేషన్ అధికారులు రాజు, పులగం, వీరేశం, వినాయక్, సాయి చరణ్, సూర్య, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బడి బయటి విద్యార్థిని బడిలో చేర్పించిన సీఆర్పీ మహమ్మద్

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని గోకుల్ తండాకు చెందిన మాలవత్ ప్రభాస్ 8వ తరగతి చదువుకోకుండా, ఇంటి వద్దనే ఉండటాన్ని గుర్తించిన సీఆర్పీ మహమ్మద్ గురువారం తల్లిదండ్రులతో మాట్లాడి, విద్యార్థికి అవగాహన కల్పించి పోసానిపేట జిల్లా పరిషత్ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు కళ్యాణి సమక్షంలో పాఠశాలలో చేర్పించారు.

ఎడపల్లి శివారులో వరి పంటలను పరిశీలించిన

నవతెలంగాణ-ఎడపల్లి

ఎడపల్లి గ్రామానికి చెందిన రైతు మచ్కూరి గంగాధర్ వరి పంటను ఎడపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి సిద్ది రామేశ్వర్‌తో పాటు మండల విస్తీర్ణ అధికారిని జ్యోతి గురువారం సందర్శించారు.

తహసీల్దార్ కార్యాలయం సందర్శన

నవతెలంగాణ-ఎడపల్లి

మండల కేంద్రంలో గల తహసీల్దార్ కార్యాలయాన్ని బోధన్ ఆర్డీవో రాజేశ్వరరావు గురువారం ఆకస్మికంగా సందర్శించారు. కార్యాలయం సంబంధించిన వివిధ రికార్డులను ఆయన పరిశీలించారు. ధరణి పనితీరును అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులను వేగవంతం చేయాలని అధికారులను సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ అధికారులు, సిబ్బంది పనితీరు సంతృప్తికరంగా ఉండడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. తహసీల్దార్ ఆకుల శేఖర్, డిప్యూటీ నారాయణ, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రభు భూపతి తదితరులున్నారు.

ఘనంగా వివేకానంద జయంతి వేడుకలు



కోటగిరిలో వివేకానంద పాఠశాల చిన్నారుల వేషధారణ

నవతెలంగాణ-కోటగిరి

కోటగిరి మండల కేంద్రంలోని వివేకానంద పాఠశాలలో స్వామి వివేకానంద 160వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు వివేకానంద నినాదాలు చేస్తూ వివేకానందతో పాటు వివిధ వేషధారణలతో అలరించారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు మాట్లాడుతూ.. వివేకానందను ఆదర్శంగా తీసుకుని వారి అడుగుజాడలలో నడుచుకోవాలని పేర్కొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన రెండవ ఏఎన్ఎంలు

నవతెలంగాణ-భిక్కనూర్

తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద గురువారం నిర్వహించనున్న ధర్నా కార్యక్రమానికి మండలానికి చెందిన రెండవ ఏఎన్ఎంలు ప్రత్యేక వాహనంలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 14 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న తమను రెగ్యులర్ చేయాలని, తమకు పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ తరలిన వారిలో శ్యామల, సునీత, యాదమ్మ, మాధవి, మంజుల తదితరులున్నారు.

పాఠశాలల్లో ముగ్గుల పోటీలు

- ఘనంగా సంక్రాంతి సంబురాలు
- విజేతలకు బహుమతులు పంపిణీ

నవతెలంగాణ-విలేకరుల బృందం



లింగంపేట్ : సజ్జన్‌పల్లిలో..



జుక్కల్ : లొంగన్‌లో..



బోధన్ : ఆహార పదార్థాలను తిలకిస్తున్న వైస్ ఎంపీపీ

తాడ్వాయి : మండల కేంద్రంలోని రవీంద్రభారతి పాఠశాలలో సంక్రాంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు అందమైన రంగవల్లులు వేసి, పతంగులను ఎగురవేసి, నృత్యాలతో పాఠశాల ప్రాంగణమంతా కనువిందు చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఆదిస్వామి మాట్లాడుతూ.. సూర్యుడు మకర రాశిలో ప్రవేశించే రోజును మకర సంక్రాంతి అంటారని, ఈ పండుగను మూడు రోజులు ఘనంగా జరుపుకుంటారని తెలిపారు. అలాగే స్వామి వివేకానంద జయంతి సందర్భంగా సమాజంపై అత్యంత ప్రభావం చూపిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ భాస్కర్ గౌడ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట్ : మండలంలోని సజ్జనపల్లి పాఠశాలలో సంక్రాంతి సంబురాలు గురువారం నిర్వహించినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు దామోదర్ తెలిపారు. విద్యార్థులకు రంగోళి పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందివ్వనున్నట్టు తెలిపారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్ పలువురిని ఆకట్టుకుంది. భోగి మంటలు వేస్తూ, పతంగులు ఎగురవేస్తూ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహాన్ని ప్రదర్శించారు. 7వ తరగతి విద్యార్థి సాయికుమార్ హరిదాసు వేషధారణలో అలరించాడు. అదేవిధంగా కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల, శెట్టిపల్లి సంగారెడ్డి ప్రాథమిక పాఠశాల, జల్దిపల్లి ప్రాథమిక పాఠశాల, నల్లమడుగు ఉన్నత పాఠశాల, నల్లమడుగు ప్రాథమిక పాఠశాల, కొర్పోలు ప్రాథమిక పాఠశాలలో సంక్రాంతి సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాల్‌రెడ్డి, సంగుభాయ్యా, రమేష్, సౌజన్య, సాయన్న, కస్తూర్బా ప్రిన్సిపాల్ వాసంతి, రవీందర్ శర్మ, పద్మ, బన్సీ, జాకిర్, కవిత, సంగమేశ్వర్, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ : మండలంలోని ఆదర్శ పాఠశాలలో సంక్రాంతి పండుగ పురస్కరించుకొని ముగ్గుల పోటీలను నిర్వహించినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ బలరాం తెలిపారు. పాఠశాల ఆవరణలో విద్యార్థినీలు రంగురంగుల ముగ్గులతో అలరించగా, పాఠశాలలో ఉపాధ్యాయురాలు ముగ్గులను పరిశీలించి విద్యార్థులకు బహుమతులను ఇవ్వనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

ఎడపల్లి : బాలబాలికల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకుగానూ ఆట, పాటలతో పాటు ముగ్గుల పోటీలు ఎంతో దోహదపడతాయని శ్రీ మాధవి స్కూల్ పాఠశాల కరస్పాండెంట్ మల్లెపూల సురేష్ గౌడ్ అన్నారు. మకర సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని ఎడపల్లి మండల కేంద్రంలో గల శ్రీ మాధవి పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబురాలు నిర్వహించారు. బాల బాలికలు తయారుచేసిన వివిధ ఆట పరికరాలు పలువురిని మైమరిపించాయి. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ సురేష్ గౌడ్ మాట్లాడారు. చదువుతోపాటు బాలబాలికలకు ఆట, పాటలతో పాటు క్రీడలు తప్పనిసరిగా ఉపాధ్యాయులు నేర్పిస్తున్నట్టు ఆయన తెలిపారు. అనంతరం బాల బాలికలకు బహుమతులను పాఠశాల కరస్పాండెంట్ మల్లెపూల సురేష్ గౌడ్‌తో పాటు ఉపాధ్యాయులు అందజేశారు.

పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్

బోధన్ : బోధన్ మండలంలోని మావందిఖుర్ద్ పాఠశాలలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని విద్యార్థులు ఫుడ్ ఫెస్టివల్ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన పిండి వంటలు ప్రదర్శించారు. విద్యార్థులు ప్రదర్శించిన వంటకాలు గ్రామ పెద్దలను ఆకట్టుకున్నాయి. అనంతరం సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గులు వేశారు. విద్యార్థులు గాలిపటాల ఎగురవేసి సందడి చేశారు. అనంతరం స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన బోధనలను వివరించారు. ప్రతి విద్యార్థి వివేకానందుని బోధనలను అనుసరించాలని వక్తలు సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కోట గంగారెడ్డి, గ్రామ పెద్దలు సాయిలు, ఉప సర్పంచ్ రాజు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గాంధారి : మండల కేంద్రంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో, ప్రైవేట్ పాఠశాలల్లో ముగ్గులు పోటీలు, పతంగుల పోటీలు నిర్వహించారు. మండల కేంద్రంలోని కేటీఎస్ పాఠశాల విద్యార్థులు వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. అలాగే నాగులూరు ప్రాథమిక పాఠశాలలో విద్యా కమిటీ చైర్మన్ గొర్రె గంగాధర్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులు ముగ్గుల పోటీలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. పతంగులు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

సిద్ధార్థ విద్యాలయంలో సంక్రాంతి వేడుకలు

భిక్కనూర్ : భిక్కనూర్ పట్టణంలో సిద్ధార్థ విద్యాలయ పాఠశాల ఆవరణలో సంక్రాంతి పండుగ సందర్భంగా వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు హరిదాసుల వేషధారణ, భోగి మంటలు వేసుకొని ఆటపాటలు పాడారు. అలాగే విద్యార్థులు పాఠశాల ఆవరణలో ముగ్గులు వేశారు. ప్రతి ఒక్కరూ సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించుకోవాలని పాఠశాల యాజమాన్యం సూచించింది. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

లొంగన్ ఎంపీపీఎస్‌లో ముగ్గుల పోటీలు..

జుక్కల్ : మండలంలోని లొంగన్ ఎంపీపీఎస్ పాఠశాల హెచ్‌ఎం నీలీమా ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు, ఆటల పోటీలను గురువారం నిర్వహించారు. అదేవిధంగా కేమ్రాజ్‌కల్లాలీ హెచ్‌ఎం జయచండ్, ఉపాధ్యాయులు కలిసి స్వామి వివేకానంద జయంతి సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు, ముగ్గుల పోటీలను నిర్వహించారు. అనంతరం ముగ్గుల పోటీలలో, ఆటలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఇరు పాఠశాలల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.



ఎడపల్లి : మాధవి స్కూల్‌లో..

ప్రజా సమస్యల పరిష్కారానికి నవతెలంగాణ కృషి

- ఎమ్మెల్యే హనుమంత్ షిండే
- 'నవతెలంగాణ 2023' క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-బిచ్కుంద



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

ప్రజా సమస్యల పరిష్కారానికి నవతెలంగాణ దినపత్రిక కృషిచేస్తుందని ఎమ్మెల్యే హనుమంత్ షిండే అన్నారు. గురువారం బిచ్కుంద మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో నవతెలంగాణ నూతన క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నవతెలంగాణ దినపత్రికలో గ్రామ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు ప్రజల సమస్యలను నవతెలంగాణ దినపత్రికలో కథనాలుగా ప్రచురించి అధికారుల ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బన్సీ, ఉమ్మడి జిల్లా డెస్క్ ఇంచార్జ్ మధు, మద్నూర్, బిచ్కుంద, జుక్కల్, పిట్లం, నిజాంసాగర్ విలేకరులు హనుమండ్లు, శ్రీనివాస్, గంగాధర్, పామయ్య, హుల్లాజీ పాల్గొన్నారు.

బోధన్ జిల్లా సాధించే వరకూ పోరాడుదాం

నవతెలంగాణ-బోధన్

బోధన్ జిల్లా సాధనకై బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు గురువారం నాటికి 25వ రోజుకు చేరాయి. కాగా దీక్షలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు గంగారెడ్డి, అనిల్, గంగాధర్‌గౌడ్ పాల్గొన్నారు. దీక్షలను సీపీఐ పార్టీ నాయకులు షేక్ బాబు పూల మాలలు వేసి దీక్షను ప్రారంభించారు. దీక్ష శిబిరంలో సీపీఐ నాయకులు షేక్ బాబు మాట్లాడుతూ బోధన్ ప్రత్యేక జిల్లా కోసం న్యాయ వాదుల చేస్తున్న ఉద్యమానికి తమ పార్టీ పూర్తి మద్దతు తమ సహకారం అందిస్తామని ప్రకటించారు. బోధన్ జిల్లాగా రూపొందటానికి కావాల్సిన అన్ని అర్హతలు ఉన్నాయని అన్నారు. ఈ ఉద్యమానికి అన్ని వర్గాల ప్రజలు, ప్రజాసంఘాలు, ముఖ్యంగా విద్యార్థులు సహకరించాలని పిలుపునిచ్చారు. న్యాయవాదులు సీహెచ్.వి.హనుమంతరావు, అర్జున్ రండర్, ఈశ్వర్, టీ.శంకర్, కోటేశ్వరరావు, పాల్దే శంకర్, భానోత్ రమేష్, ధర్మయ్య, అడ్లూరి శ్రీనివాస్, దత్తాత్రి కులకర్ణి, అజయ్, శేఖర్, న్యాయవాదుల గుమస్తల సంఘం గంగాధర్, జమ్మర్ ఖాన్, హన్మండ్లు, ఖైసర్, బోధన్ రైల్వే విద్యార్థి జేఏసీ నాయకులు శివకుమార్, నాగరాజ్, గంగా ప్రసాద్ అప్పా తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో వివేకానంద విగ్రహాలు ఆవిష్కరణ

నవతెలంగాణ-సదాశివనగర్




విగ్రహావిష్కరణలో మాట్లాడుతున్న దృశ్యం

మండలంలోని రెండు గ్రామాల్లో స్వామి వివేకానంద విగ్రహాలను గురువారం ఆవిష్కరించారు. మండలంలోని వజ్జపల్లితండా, అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామాల్లో విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో ఇండియన్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ యజ్ఞం పవన్ కుమార్ శర్మ మాట్లాడుతూ.. విలువలతో కూడిన విద్యను నేర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. చరిత్ర మూలలను తెలుసుకోవాలన్నారు. ఏకాగ్రత ఉండాలని చెప్పారు. అలాగే గురుకుల మహిళా డిగ్రీ కాలేజీలో విద్యార్థులు ఉత్సాహంగా జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. సూక్తులు పోస్టర్ రూపంలో ఆవిష్కరించారు. వ్యాస రచనా పోటీలు నిర్వహించారు. మండల కేంద్రంలోని వివేకానందుని విగ్రహానికి జిల్లా ఎస్సీ సెల్ కాంగ్రెస్ అధ్యక్షుడు మద్దెల బాగయ్య పూలమాలలు వేశారు. వజ్జపల్లి తండాలో విగ్రహావిష్కరణలో ఎంపీపీ గైని అనసూయ సర్పంచ్ అనిల్ ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బొలిపెల్లి మహేందర్‌రెడ్డి, సర్పంచ్ జానకి, ఉపసర్పంచ్‌లు లక్ష్మీపతి, స్రవంతి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వడ్ల రాజేందర్, శీనునాయక్, ఇండియన్ క్లబ్ అధ్యక్షుడు ఆంజనేయులు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాధికా, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ కప్ -2023 విజేత 'మహారాణ' జట్టు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



కప్పు అందజేస్తున్న దృశ్యం

గ్రామీణ స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకే క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు అర్బన్ ఎమ్మెల్యే గణేష్ బిగాల, జెడ్పీ చైర్మన్ దాదన్న గారి విట్టల్ అన్నారు. మూడు రోజులుగా ఉత్సాహంగా సాగిన కేసిఆర్ కబడ్డీ టోర్నమెంట్ పోటీలు గురువారం ముగిశాయి. కేసీఆర్ సేవాదళ్ ఆధ్వర్యంలో చేపట్టిన నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి కేసీఆర్ కప్ కబడ్డీ టోర్నమెంట్లో ఏడు నియోజకవర్గాలకు చెందిన 40 టీంలు పాల్గొన్నాయి. ఇందులో నిజా మాబాద్, బాల్కొండ మండలం కొత్తపల్లి జట్టు ఫైనల్‌కు చేరుకోగా.. హెూరా హెూరీగా ఫైనల్ మ్యాచ్ జరిగింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథు లుగా అర్బన్ ఎమ్మెల్యే జెడ్పీ చైర్మన్, నగర మేయర్ దండు నీతూ కిరణ్, సమాచార హక్కు కమిషన్ రాష్ట్ర చైర్మన్ మహమ్మద్ అమీర్, తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ రాజీవ్ సాగర్, హాజరయ్యారు.

యువత మంచి మార్గంలో నడవాలి

- వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలి
- ఘనంగా యువజన దినోత్సవ వేడుకలు
- విద్యార్థులకు ముగ్గులపోటీలు.. బహుమతులు పంపిణీ

నవతెలంగాణ-విలేకరుల బృందం



పెద్దకొడప్‌గల్‌లో..

యువత మంచి మార్గంలో నడవాలని పలువురు సూచించారు. వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలని, చెడు అలవాట్లకు బానిస కావొద్దని తెలిపారు. గురువారం వివేకానంద 160వ జయంతి సందర్భంగా యువజన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో వివేకానందుడి విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు పాఠశాలల్లో ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

రాజంపేట్ ఎంపీఓగా రఘురాం

నవతెలంగాణ-రాజంపేట్

రాజంపేట ఎంపీఓగా గురువారం నూతన బాధ్యత స్వీకరించారు. ఈయన పదోన్నతిపై ఆర్మూర్ మండలం నుంచి వచ్చారని ఎంపీడీవో బాలకిషన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లింగాల స్వరూప, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల ట్రాక్టర్‌లకు జీపీఆర్ఎస్ తప్పనిసరి

నవతెలంగాణ-పిట్లం

గ్రామ పంచాయతీల ట్రాక్టర్లకు జీపీఆర్ఎస్ చేయించుకోవాలని ఎంపీఓ బ్రహ్మం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని పంచాయతీల అభివృద్ధికి గాను కొనుగోలు చేసిన ట్రాక్టర్లకు జీపీఆర్ఎస్ బిగించుకోవాలని, అందుకు సంబంధిత నిపుణులు జనవరి 13న ఉదయం మండల పరిషత్ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని, అన్ని పంచాయితీల ట్రాక్టర్లను కార్యాలయానికి తీసుకురావాలని ఆయన సూచించారు.

బాక్సింగ్ ఛాంపియన్ నిఖత్ జరీన్‌ను అభినందించిన డీసీసీ ఉపాధ్యక్షుడు

నవతెలంగాణ-భిక్కనూర్

తెలంగాణ ముద్దుబిడ్డ, ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్ నిఖత్ జరీన్‌ను కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మద్ది చంద్రకాంత్‌రెడ్డి గురువారం శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి యువత నిఖత్ జరీన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని, అలాగే కుమారి నిఖత్ జరీన్ భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ మెడల్స్ సాధించి దేశానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి షబ్బీర్ అలీ, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కుంట లింగారెడ్డి తదితరులున్నారు.

ఇసుక తరలింపుపై తహసీల్దార్‌కు వినతిపత్రం

నవతెలంగాణ-కోటగిరి

పోతంగల్ మండలంలోని హంగర్గ గ్రామం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు కొట్టం మనోహర్, హనుమంతు తదితరులు ట్రాక్టర్లు ఆపివేశారు. అనంతరం తహసీల్దార్ రమేష్‌కు ఎటువంటి పర్మిషన్ లేకుండా ఇసుక తరలిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై తహసీల్దార్‌ను వివరణ కోరగా కలెక్టర్ ఆదేశాల మేరకు రెండు పడకగదులకు ఇసుక తరలిస్తున్నామని, కావాలనే కొంత మంది వారి ట్రాక్టర్లను పట్టుకోవడంతో ట్రాక్టర్లు ఆపేశారని తెలిపారు. కారేగాం, సుంకేని గ్రామాలకు ప్రభుత్వం పర్మిషన్ ఇచ్చారని, హంగర్గ గ్రామం నుంచి ఎటువంటి పర్మిషన్ లేదని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. కలెక్టర్ అనుమతి లేకుండా ఏ విధంగా ఇసుక తరలిస్తారని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.

వరి సాగులో వెదజల్లే పద్ధతి మేలు

నవతెలంగాణ-రామారెడ్డి

వరి సాగులో వెదజల్లే పద్ధతితో ఎకరానికి రూ.5వేల నుంచి రూ.6వేల పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని, రైతులకు దిగుబడి పెరగటంతో ఆర్థికంగా లాభం చేకూరుతుందని రామారెడ్డి గ్రామ వ్యవసాయ అధికారి రాకేష్ రైతులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలో వెదజల్లే పద్ధతితో వరి సాగు చేసిన పంటకు కలుపు మందు పిచికారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు గాండ్ల లింబాద్రి, భానూరి చిన్న గంగారెడ్డి, కొట్లే లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని మైనార్టీ సబ్సిడీ రుణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 17వ తేదీన మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో అనంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 11 గంటలకు హాజరుకావాలని తెలిపారు.

ఆయిల్ ఫామ్ సాగు పరిశీలన

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ రూరల్ మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామంలో పాతూరి వరప్రసాద్ రావు అనే రైతు మూడు ఎకరాల్లో ఆయిల్ పామ్ తోటను సాగు చేయడంతో వ్యవసాయాధికారులు గురువారం పరిశీలించారు. పంట సాగులో ఏవైనా సమస్యలు ఉన్నాయా.. వాటిపై మరింత అవగాహన కల్పించేందుకు నిజామాబాద్ రూరల్ సహాయ వ్యవసాయ సంచాలకులు రాంబాబు, మండల వ్యవసాయ అధికారి జాదవ్ హీరా సందర్శించారు. వారితో పాటు సర్పంచ్ శ్రీనివాస్, రైతులు ఆకుల శ్రీనివాస్, ఆకుల రాములు, కిష్టయ్య, రాంరెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు జ్ఞానేశ్వర్, రాకేష్, స్వాతిలత, రమాకాంత్ పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబాలకు సర్పంచ్ చేయూత

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిరుపేద కుటుంబాలకు చెందిన ఏ ఒక్క వ్యక్తి మృతిచెందిన తమ వంతు సహకారం అందిస్తామని సర్పంచ్ నోముల విజయలక్ష్మి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం ఇందల్‌వాయి మండలంలోని నల్లవెల్లి గ్రామంలో నిరుపేద కుటుంబంలో పుట్టిన కద్దూరం సత్యగంగు అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందింది. విషయం తెలుసుకుని బాధితురాలి ఇంటికి వెళ్ళి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ వంతుగా అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం మూడువేల రూపాయలను కుటుంబ సభ్యులకు అందజేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన వారు ఎవరనేది ఆలోచించకుండా మృతి చెందిన వారికి ఆర్థిక సహాయం అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నీరడీ మనోహర్, కార్ల భాస్కర్, పల్లె సాయిలు, లింగపురం రవి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పలు పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు గురువారం నిర్వహించారు. హరిదాసు వేషాధారణతో విద్యార్థులు అలరించారు.

భీంగల్:పట్టణకేంద్రంలోని శ్రీ సరస్వతి విద్యామందిర్ పాఠశాలలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో 9, 10 తరగతి విద్యార్థినిలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో దీప్తి (ప్రథమ), సుకన్య (ద్వితియ), పూర్ణిమ (తృతీయ), మహేశ్వరి (నాల్గవ), రజిత (ఐదవ) స్థానంలో నిలిచారు. వీరికి పాఠశాల అధ్యక్షుడు డాక్టర్ బసంత్‌రెడ్డి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నర్సరెడ్డి, రవికుమార్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మోర్తాడ్ :మండల కేంద్రంలోని కృష్ణవేణి పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించుకున్నారు. విద్యార్థులు హరిదాసు వేషారణలో సంక్రాంతి భోగి పండుగ సంబరాలను నిర్వహించుకున్నారు. పలువురు విద్యార్థులు కైట్ పోటీల్లో సైతం పాల్గొన్నారు. పాఠశాల ఉపాధ్యాయినిలకు రంగవల్లిక పోటీలను నిర్వహించారు.



ఆర్మూర్ : ప్రజ్ఞ ఐఐటి పాఠశాలలో..



మోర్తాడ్‌లో..

శ్రీ చైతన్య పాఠశాలలో...

కంఠేశ్వర్:నిజామాబాద్ పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు సాంప్రదాయ దుస్తులతో, నృత్యాలు, పాటలతో, పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. రంగవల్లుల పోటీలు నిర్వహించి ప్రత్యేక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రవీణ మాట్లాడుతూ.. సంక్రాంతి పండగ సంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పట్టే పండుగ అని, కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీ విద్యా డీజీఎం లక్ష్మణ్ రావు , ఆర్ ఐ రాజు , కోఆర్డినేటర్స్, ఇంచార్జీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్మూర్ : పట్టణంలోని లిల్లీపుట్ ప్రజ్ఞ ఐఐటి పాఠశాల, గాంధీ నగర్ ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులందరూ రంగురంగుల దుస్తులతో అలరించారు. పాఠశాల యజమాన్యం విద్యార్థులకు పేరెంట్స్, ఉపాధ్యాయినులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో భోగిమంటలు వెలిగించి పాలు పొంగించారు. కార్యక్రమంలో లిల్లీపుట్ రామకృష్ణ, దాస్ ప్రజ్ఞ రోమా వంశీ, మానస పద్మ పాల్గొన్నారు.

మోర్తాడ్:మండల కేంద్రంలోని క్రీడా మైదానంలో విప్రో సంతూర్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన రంగవల్లిక పోటీల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సంతూర్ పేరుతో రంగవల్లిక పోటీలను నిర్వహించారు. ఉత్తమ రంగవల్లికకు బహుమతులతో పాటు నలుగురికి బహుమతులను సర్పంచ్ ధరణి అందజేశారు. రంగవల్లిక పోటీలో పాల్గొన్న మిగతా వారందరికీ సంతూర్ సోప్‌కు సంబంధించిన బహుమతులను అందించారు ప్రథమ బహుమతికి గ్రాండర్, ద్వితీయ బహుమతి రైస్ కుక్కర్, మరో నాలుగు కన్సోలేషన్ బహుమతుల కింద హాట్ బాక్స్‌లను అందించారు. కార్యక్రమంలో విప్రో సంతోష్‌చ సంస్థ సిబ్బంది రవికుమార్, సురేష్, శ్రీనివాస్, సంతోష్, సోనీ, తదితరులు పాల్గొన్నారు.



భీంగల్‌లో..

నిజామాబాద్‌సిటీ : బ్రిలియంట్ హైస్కూల్లో ప్రిన్సిపాల్ కేసరి రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను నిర్వహించారు.



నిజామాబాద్‌సిటీ : బ్రిలియంట్ హైస్కూల్లో...

రాముడిని అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేయొద్దు



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-సిరికొండ

హిందువుల దేవుడైన రామున్ని అడ్డుపెట్టుకొని భారతీయ జనతా పార్టీ రాజకీయాలు చేస్తుందని, ఇలాంటివి చేయొద్దని రూరల్ ఎమ్మెల్యే, టీఎస్ ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏడు మండలాల క్రైస్తవులు ఏర్పాటుచేసిన క్రిస్టమస్, నూతన సంవత్సరం విందు కార్యక్రమానికి, ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ... దేశంలో ఎక్కడా లేనివిధంగా, కేవలం తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ సంక్షేమ పథకాలను ప్రవేశపెడితే ఓర్వజాలక తప్పుడు ప్రచారాలు చేస్తూ, బురదజల్లే రాజకీయాలను బీజేపీ అవలంభిస్తుందని అన్నారు. కుల,మతాల మధ్య చిచ్చులు పెట్టి, హిందువులు, ముస్లిం, క్రైస్తవుల మధ్య తగాదాలు సృష్టిస్తుందని తెలిపారు. ప్రజలు బీజేపీ ప్రభుత్వానికి గట్టి బుద్ధి చెప్తారని ఆయన అన్నారు. గుజరాత్ కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్తలు లక్షల కోట్ల రూపాయలు అప్పు తీసుకొని, విదేశాలు పారిపోతే, మోడీ ప్రభుత్వం వారి రుణాలను మాఫీ చేసిందని, కానీ మామూలు ప్రజానీకానికి సంక్షేమ పథకాలు అందిస్తే ఫ్రీగా ఎలాంటి పథకాలు ప్రవేశపెట్టవద్దని సూచించడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. అనంతరం లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులు 88 లక్షలు, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు 9 లక్షలు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎన్నం రాజారెడ్డి, ఎంపీపీ సంగీత రాజేందర్, జడ్పిటిసి మాలవత్ మాన్సింగ్ నాయక్, తహసీల్దార్ గఫార్ మియా, సర్పంచులు, ఎంపీటీసీలు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది మృతి పట్ల సంతాపం



సంతాపం తెలుపుతున్న న్యాయవాదులు

నవతెలంగాణ-ఆర్మూర్

నిజామాబాద్‌కు చెందిన నూనె రత్నాకర్ న్యాయవాది మృతికి బార్ అసోసియేషన్ అధ్యక్షులు గంట విప్లవ్ కిరణ్ సంతాపం ప్రకటించారు.

అధ్యక్షులు విప్లవ్ కిరణ్ , భూపతి రెడ్డి మోహన్, సీనియర్ న్యాయవాదులు ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ బుట్టి మధు, కోశాధికారి పవన్ కుమార్, సీనియర్ న్యాయవాదులు తులసీదాసు, చిలక కిష్టయ్య, పండిట్ నెహ్రు, బెతూ జగదీష్, తెడ్డు నర్సయ్య, అయినారి అశోక్, జీవన్ ఆవుల అశోక్ పాల్గొన్నారు.

దళిత సంఘాలకు కమ్యూనిటీ హాళ్ల సీడీపీ నిధులు మంజూరు పత్రాలు పంపిణీ



నిధులు మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త క్యాంపు కార్యాలయం లో నిజామాబాద్ నగరంలోని 5 దళిత సంఘాల కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం కోసం ఒక సంఘానికి 7.20 లక్షల చొప్పున 5 సంఘాలకు 36 లక్షల ఎమ్మెల్యే కోట సీడీపీ నిధులు మంజూరు పత్రాలని గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్ , నుడ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, బి ఆర్ ఎస్ కార్పొరేటర్లు, నాయకులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

స్కూప్స్ ఐస్ క్రీమ్ షాప్‌ని ప్రారంభించిన ఎమ్మెల్యే

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేష్ బిగాల న్యూ కలెక్టరేట్ బైపాస్ రోడ్డు లో స్కూప్స్ ఐస్ క్రీమ్ షాప్ ని గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్, నుడ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న ఎంఈవో, విద్యాధికారి

నవతెలంగాణ-భీంగల్

మండలంలోని జాగిర్యాల్ ఉన్నత పాఠశాలలో పీటీఎఫ్‌గా పనిచేసిన లక్ష్మినారాయణ కుటుంబానికి మండల విద్యాధికారి స్వామి, ఉపాధ్యాయులు కలిసి 10 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందజేశారు. లక్ష్మినారాయణ ఇటీవల గుండెపోటుతో మరణించడంతో తమవంతుగా ఉపాధ్యాయులు ఆర్థిక సాయాన్ని మృతుని కుటుంబానికి గురువారం అందజేశారు. అందజేసిన వారిలో యంఈఓ స్వామి, చంద్రమోహన్, శ్రీనివాస్, ఏడుకొండలు, రవి తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాల అమలులో నెంబర్ వన్

ఆర్టీసీ చైర్మన్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేయడం లో దేశంలోనే తెలంగాణ నెంబర్ వన్‌గా ఉందని ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. గురువారం ఇందల్ వాయి మండలంలోని చంద్రయాన్ పల్లి గ్రామనికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చెవుల మల్లయ్య ఎమ్మెల్యే అధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అయనకు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఆర్థిక ప్రణాళిక సంఘం సభ్యులు ధర్పల్లి జడ్పిటిసి బాజిరెడ్డి జగన్ మోహన్, ఎంపిపి బాదవత్ రమేష్ నాయక్, ఐడిసిఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, పార్టీ మండల అధ్యక్షులు చిలివేరి గంగా దాస్, సీనియర్ నాయకులు అరటి రఘు, పాశం కుమార్, సర్పంచ్ లలిత గంగదాస్, సొసైటి డైరెక్టర్ గంగారెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేయాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్ పల్లి, ఇందలవాయి మండల పరిషత్ కార్యాలయం, సీహెచ్‌సీలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఆశా కార్యకర్తలకు వేర్వేరుగా కంటి వెలుగు-2 శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ డివిజన్ డిప్యూటీ డిఎంహెచ్‌ఓ తూకరం రాథోడ్, ఎంపిపి బాదవత్ రమేష్ నాయక్, ఆరోగ్య విస్తరణ అధికారి వై శంకర్, వైద్యాధికారి సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని అందరూ దిగ్విజయంగా పూర్తి చేయాలని, గ్రామ కార్యదర్శులు కంటి వెలుగు కార్యక్రమానికి సరియైన ఏర్పాట్లు చేయాలని, కంటి వెలుగు శిబిరాల్లో తాగు నీటి, మరుగుదొడ్డి సౌకర్యం కూర్చోవడానికి ఆరు టేబుల్లు, టెంట్లు ఏర్పాటు చేయాలని అన్నారు. ఇంటింటికి కంటి వెలుగు శిబిరంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, మందిరాలు, మసీదులు, చర్చిల్లో మైకులు పెట్టి ప్రతి ఇంట్లో అవగాహన కలిగే విధంగా విస్తృతంగా ప్రచారానికి ఏర్పాటు చేయాలని, ప్రజా ప్రతినిధులకు ఆహ్వాన పత్రికలు పంచాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ గోపి బాబు, మండల పరిషత్ అధికారులు రాజ్ కాంత్ రావు, కిషన్ రావు పంచాయతీ కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది, సూపరింటెండెంట్ లక్ష్మారెడ్డి తోపాటు తదితరులు పాల్గొన్నారు.



జూట్ పరిశ్రమను తరలించే ఆలోచనను వెనక్కు తీసుకోవాలి : సీపీఐ

- జనపనార బోర్డు రద్దు చేస్తే మరింత నిరుద్యోగం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

జూట్ పరిశ్రమను తరలించే ఆలోచనను వెనక్కు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

హైదరాబాద్ లోగల జనపనార (జూట్)బోర్డు తెలంగాణ ప్రాంతీయ కార్యాలయాన్ని కేంద్ర ప్రభుత్వం తరలించడం క్షమించరానిదని అన్నారు. తెలంగాణకు పసుపు బోర్డు ఇస్తామని హామీ ఇచ్చి 9 సంవత్సరాలు ముగుస్తున్న ఏర్పాటు చేయలేదని అన్నారు.

ప్రస్తుతం తెలంగాణలో ఉన్న జూట్ పరిశ్రమను తరలించడం ఆపాలని సిపిఐ జిల్లా కౌన్సిల్ డిమాండ్ చేస్తుందని తెలిపారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీనిచ్చి అమలు చేయకుండా, ఉన్న పరిశ్రమలను ఉత్తర రాష్ట్రం నుండి కేంద్రానికి తరలించుకుపోవడం సిగ్గుచేటని అన్నారు. తెలంగాణలో గతంలో 25 వేల ఎకరాల్లో జనుము సాగు అవుతుందని, ప్రస్తుతం 50 వేల ఎకరాలకు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని అన్నారు.

ఇటువంటి పరిస్థితుల్లో కేంద్ర ప్రాంతీయ కార్యాలయం తరలింపు వల్ల ఈ జూట్ సంస్థపై ఆధారపడ్డ మూడు వేలకు పైగా చిన్న తరహా పరిశ్రమలు మూతపడి నిరుద్యోగం మరింత పెరుగుతుందని తెలిపారు. అందువల్ల కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో ఉన్న జూట్ పరిశ్రమను తరలించే ఆలోచనను వెనక్కు తీసుకోవాలని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి సుధాకర్

తెలంగాణతోపాటు దక్షిణాది రాష్ట్రాలపై బీజేపీ చూపుతున్న నిర్లక్ష్యానికి ఇది నిదర్శమని అన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా నాయకులు వై.ఓమయ్య రఘురాం, హనుమండ్లు, వంశీ పాల్గొన్నారు.

PUBLIC NOTICE

This is to inform the general public and all financial institutions that one Smt. Somu Vimala W/o Somu Rajeshwar, aged about (42) years, Occ: House Wife,R/o H. No: 8-4/2, Dharpally Village and Mandal, District Nizamabad, that the below mentioned schedule property is owned by the above person, who got the Schedule Property with boundaries, from his Donor SriSomu Rajeshwar S/o Nadipi Rajanna. And the same property she is now offering towards security for availing Housing Loan by creating Mortgage over the same infavour of my client company **TATA** Capital Housing Finance Limited, Nizamabad Branch.

Schedule of Property with its "Registered Gift (Settlement) Deed Doc. No. 9275/2021, Dated: 21-06-2021" pertaining to the "The Existing Open Place bearing G.P. Nos. (8-4/1) vide Assessment No. 1968 & (8-4/2) vide Assessment No. 1969, admeasuring 380.00 Sq. yards or 317/71 Sq. Meters, Situated at DHARPALLY VILLAGE, Mandal Dharpally, District Nizamabad, within the Grampanchayath limits of Dharpally Village, Registration Sub-District Nizamabad Rural and Registration District Nizamabad.".

As Bound By:

NORTH : House of Kaveti Naveen.
SOUTH : House of P. Rajaram.
EAST : Road.
WEST : Plot of P. Rajaram.

Hence the General Public and financial institutions are hereby informed that, whoever, having any claim, right or any sort of right over the said property and the said documents, the same may be informed to the undersigned within (07) days from the date of publication of this notice.

Date: 12-01-2023.
Nizamabad.

R. Sri Rama Goud,
Advocate,
3-3-198, Maisamma Street,
Kotagalli, Nizamabad.
Cell No. 9440415406.

రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్, సాఫ్ట్‌బాల్ పోటీలకు ధర్మారం విద్యార్థులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోగల ధర్మారం(బీ) సీఓఈ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థినుల సన్నిధి, నేహా శ్రీ, ప్రవీణ, స్ఫూర్తి ఈనెల 5 న ఆక్స్‌ఫర్డ్ క్రీడా మైదానంలో బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో మంచి ప్రతిభను కనబరిచి 67వ రాష్ట్రస్థాయి బాల్ బాడ్మింటన్ పోటీలకు ఎంపికయినట్టు ప్రిన్సిపల్ సంగీత గురువారం తెలిపారు. వీరు ఈనెల 12 నుండి 14 వరకు ఖమ్మం జిల్లాలోని బోనకల్లులో జరిగే 67వ రాష్ట్ర బాల్ బాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటారని స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ నీరజారెడ్డి వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కిషన్, పీఈటీ జోష్న, ఉపాధ్యాయ బృందం అభినందించారు

రాష్ట్రస్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ధర్మారం విద్యార్థులు

మండలంలోని ధర్మారం సీఓఈ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాలలో చదువుతున్న విద్యార్థినిలు సరయు, నక్షత, ప్రీతి, సాత్విక, శరణ్య వీరు గత నెలలో డిచ్ పల్లి మండలంలోని సుద్దపల్లి క్రీడ మైదానంలో సాఫ్ట్ బాల్ టోర్నమెంట్లో మంచి ప్రతిభను కనబరిచి 8వ రాష్ట్రస్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయినట్టు ప్రిన్సిపల్ సంగీత గురువారం తెలిపారు. వీరు ఈనెల 12 నుండి 14 వరకు నిర్మల్ జిల్లాలోని ఎన్టీఆర్ స్టేడియంలో జరగబోయే 8.వ రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారని స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ నీరజా రెడ్డి తెలిపారు. విద్యార్థులను స్కూల్ వైస్ ప్రిన్సిపల్ కిషన్, ఒరిజినల్ స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ నీరజ రెడ్డి, పిఈటి జోష్న ఉపాధ్యాయ బృందం అభినందించారు.



సాఫ్ట్‌బాల్‌కు ఎంపికైన విద్యార్థులు

సీసీ కెమెరాలతో దొంగతనాల నియంత్రణ

సీసీ కెమెరాలు ప్రారంభించిన ఎమ్మెల్యే బాజిరెడ్డి

నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో రూరల్ ఎమ్మెల్యే, టీఎస్‌ఆర్‌టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ నూతనంగా సీసీ కెమెరాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒక్క సీసీ కెమెరా నలుగురు కానిస్టేబుళ్లలో సమానమని, సీసీ కెమెరాలు ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. సీసీ కెమెరాలు ఉంటే గ్రామాలలో దొంగతనాలు జరగవని ఆయన పేర్కొన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై నర్సింలు, సీఐ సైదా, ధర్పల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డి, సర్పంచ్ ఎన్నం రాజారెడ్డి, జెడ్ పి టి సి మాన్సింగ్ నాయక్, ఎంపీపీ సంగీత రాజేందర్, ఆకుల తిరుమల్ గౌస్ బాషా, సీనియర్ నాయకులు, సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **Fareha Sameen W/O Mohammed Abdul Javeed** R/O 5-11-51/3j8/2, Priyadarshini Nagar, Nirmal-504106, T.S. Changed My Minor Child Name From **Mohammed Abdul Aahil To Abdul Hadi Hammad.**

SAWAN SABOO - 9440560256